

ఈడెన్ గార్డెన్స్‌లో తారల తళుకులు



# ఐపీఎల్ జిగేల్

## అంబరాన్నంటిన సంబురాలు • అలరించిన షారుక్‌ఖాన్, దిశ, శ్రేయ, కరణ్

కోల్‌కతా: ఐపీఎల్ 18వ సీజన్‌కు ఘనంగా తెరలేచింది. వరుణుడు అంతరాయం కల్గిస్తాడన్న వార్తలను పటాపంచలు చేస్తూ చారిత్రక ఈడెన్ గార్డెన్స్‌లో ప్రారంభ కార్యక్రమం తారల తళుకుబెళుకుల మధ్య అట్టహాసంగా సాగింది. బాలీవుడ్ బాద్‌షా షారుక్‌ఖాన్ వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ కార్యక్రమం అభిమాలను అమితంగా ఆకట్టుకుంది. బ్లాక్ అండ్ బ్లాక్ డ్రెస్‌లో స్టేజ్‌పైకి వచ్చిన షారుక్ తనదైన శైలిలో అలరించాడు. తొలుత ప్రముఖ గాయని శ్రేయా ఘోశల్ ఉషారెత్తించే పాటలతో స్టేడియం హోరెత్తిపోయింది. పుష్ప-2 సినిమాలో వీడు మొరటోడు అంటూ పాడిన తెలుగు పాటకు ప్రేక్షకులు ఈలలు, కేరింతలతో ఊగిపోయారు. ఆ తర్వాత ప్రముఖ ర్యాపర్ కరణ్ ఔజ్లా పంజాబీ భాంగ్రా పాటలను అభిమానులు బాగా ఎంజాయ్ చేశారు. బాలీవుడ్ బ్యూటీ దిశా పటానీ అదిరిపోయే స్టెప్పులతో ఆహా అనిపించింది. కండ్లు మిరుమిట్లు గొలిపే వెలుగు జిలుగుల మధ్య దిశ



డ్యాన్స్ ఆహా అనిపించింది. షారుఖ్ ఖాన్..రింకూసింగ్, కోహ్లీతో కలిసి సరదాగా డ్యాన్స్ చేశాడు. బీసీసీఐ ప్రతినిధులు స్టేజీ పైకి రాగా 18వ సీజన్ పురస్కరించుకుని విరాట్‌ను బోర్డు అధ్యక్షుడు రోజర్ బిన్ని జ్ఞాపిక అందజేశారు. ఆ తర్వాత కోల్‌కతా, బెంగళూరు కెప్టెన్లు రహానే, రజత్ పాటిదార్‌తో కలిసి బోర్డు ప్రతినిధులు పెద్ద కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా స్టేడియంలో మిరుమిట్లు గొలిపే రీతిలో పటాకులు కోల్‌కతాకు పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చాయి. అటు పిమ్మట జాతీయ గీతాలాపన తర్వాత మ్యాచ్ మొదలైంది.



# బెంగళూరుదే బోణీ

## కోల్‌కతాపై ఘనవిజయం • కోహ్లీ, సాల్ట్ విజృంభణ • రహానే, నరైన్ పోరాటం వృథా

**పేరుకు తగ్గట్టే ఐపీఎల్-18కు అదిరిపోయే ఆరంభం! మ్యాచ్‌కు ముందు భయపెట్టిన వరుణుడు ఆట సమయానికి శాంతించినా ఇరు జట్ల బ్యాటర్లు పారించిన పరుగుల వరదలో క్రికెట్ అభిమానులు తడిసి ముద్దయ్యారు. బెంగళూరు బ్యాటర్లు ఆకలిగొన్న పులుల్లా కోల్‌కతా బౌలర్లపై విరుచుకుపడటంతో తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతాకు భంగపాటు తప్పలేదు. తాను క్రీజులో ఉన్నంతసేపు బంతిని బౌలర్ల చేతిలో కంటే బౌండరీ లైన్ అవలే ఎక్కువగా ఉంచిన సాల్ట్ వీరవిహారానికి తోడు పరుగుల వీరుడు విరాట్ కోహ్లీ మరో క్లాసికల్ ఇన్నింగ్స్ తోడవడంతో కేకేఆర్‌పై ఆర్‌సీబీదే పైచేయి అయింది.**




కోల్‌కతా: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ సీజన్‌లో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్)కు తొలి మ్యాచ్‌లోనే రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ఝలక్ ఇచ్చింది. పరుగులు వరద పారిన ఈడెన్ గార్డెన్స్‌లో బెంగళూరు.. కోల్‌కతాను 7 వికెట్ల తేడాతో మట్టికరిపించి సీజన్‌ను ఘనంగా ఆరంభించింది. రన్‌మిషీన్ విరాట్ కోహ్లీ (36 బంతుల్లో 59 నాటౌట్, 4 ఫోర్లు, 3 సిక్సర్లు), విధ్వంసకర ఓపెనర్ ఫిల్ సాల్ట్ (31 బంతుల్లో 56, 9 ఫోర్లు, 2 సిక్సర్లు), కెప్టెన్ రజత్ పాటిదార్ (34) వీరవిహారం చేయడంతో కేకేఆర్ నిర్దేశించిన 175 పరుగుల లక్ష్యాన్ని ఆర్‌సీబీ మరో 22 బంతులు మిగిలుండగానే దంచేసింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన కోల్‌కతాను సారథి అజింక్యా రహానే (56), నరైన్ (44) ఆదుకున్నా మిడిలార్డర్ వైఫల్యంతో ఆ జట్టు 174/8 వద్దే ఆగిపోయింది. కృనాల్ (3/29), హెజిల్‌వుడ్ (2/22) ప్రత్యర్థిని కట్టడి చేశారు. కృనాల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

### కోహ్లీ, సాల్ట్ వీరవిహారం

ప్లేబోల్డ్! ఆర్‌సీబీ ట్యాగ్‌లైన్ ఇది. దీని అర్థమేంటో బెంగళూరు ఆడుతున్న తొలి మ్యాచ్‌లోనే సాల్ట్, కోహ్లీ ప్రత్యర్థులకు తమ ఆటతీరుతో చెప్పేశారు. ఈ ఓపెనింగ్ జోడీ దూకుడుతో కోల్‌కతా లక్ష్యం చిన్నబోయింది. తొలి పవర్ ప్లేలోనే ఆ జట్టు వికెట్ నష్టపోకుండా 80 పరుగులు చేసిందంటే వాళ్ల దూకుడు ఎలా సాగిందో అర్థం చేసుకోవచ్చు. వైభవ్ అరోరా వేసిన మొదటి ఓవర్ తొలి బంతినే అద్భుతమైన కవర్ డ్రైవ్‌తో బౌండరీకి తరలించిన అతడు.. పరుగుల వేటను ఘనంగా మొదలుపెట్టాడు. అతడే వేసిన మూడో ఓవర్లో 4, 6, 4తో విధ్వంసానికి శ్రీకారం చుట్టాడు. మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి 4 ఓవర్లో అయితే ఓ భారీ సిక్సర్‌తో పాటు మూడు బౌండరీలతో 21 పరుగులు రాబట్టాడు. సాల్ట్ విజృంభణతో మరో ఎండ్‌లో కోహ్లీ కూడా రెచ్చిపోయాడు. సాధారణంగా ప్రారంభంలో నెమ్మదిగా ఆడి తర్వాత విజృంభించే కోహ్లీ.. ఈ మ్యాచ్‌లో ఆరంభం నుంచే దూకుడుగా ఆడాడు. స్పెన్సర్ జాన్సన్ 5వ ఓవర్లో లాంగాఫ్ మీదుగా తనదైన ట్రేడ్ మార్క్ సిక్సర్లతో అలరించాడు. 25 బంతుల్లోనే సాల్ట్ హాఫ్ సెంచరీ పూర్తిచేశాడు. ప్రమాదకరంగా పరిణమిస్తున్న ఈ జోడీని ఎట్టకేలకు చక్రవర్తే 9వ ఓవర్లో విడదీయడంతో 95 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. సాల్ట్ నిష్క్రమించే సమయానికి బెంగళూరు.. లక్ష్యంలో సగాన్ని పూర్తి చేసి పటిష్ట స్థితిలో నిలిచింది. పడిక్కల్ (10) కూడా నిరాశపరిచినా రజత్, లివింగ్‌స్టన్ (5 బంతుల్లో 15 నాటౌట్) దూకుడుగా ఆడటంతో బెంగళూరు బోణీ కొట్టింది.

**సంక్షిప్త స్కోర్లు:**

**కోల్‌కతా:** 20 ఓవర్లలో 174/8 (రహానే 56, నరైన్ 44, కృనాల్ 3/29, హెజిల్‌వుడ్ 2/22)

**బెంగళూరు:** 16.2 ఓవర్లలో 177/3 (కోహ్లీ 59 నాటౌట్, సాల్ట్ 56, నరైన్ 1/27, వైభవ్ 1/42)

### రహానే-నరైన్ షో

కోల్‌కతా ఇన్నింగ్స్‌లో రహానే, ఓపెనర్ నరైన్ ఇన్నింగ్సే హైలైట్. ఈ ఇద్దరూ ఉన్నంతవరకూ కోల్‌కతా 10 రన్‌రేట్‌కు తగ్గకుండా పరుగులు రాబట్టింది. కానీ ఈ ద్వయం నిష్క్రమించిన తర్వాత మిడిలార్డర్ కుప్పకూలడంతో మోస్తరు స్కోరుకే పరిమితమైంది. డికాక్ (4).. హెజిల్‌వుడ్ వేసిన తొలి ఓవర్లో రెండో బంతినే బౌండరీకి తరలించాడు. కానీ అదే ఓవర్లో ఐదో బంతికి ఔట్ అయ్యాడు. 3 ఓవర్లకు కేకేఆర్ స్కోరు 9/1. కానీ పవర్ ప్లే ముగిసేసరికి అది 60/1గా నిలిచింది.సలామ్ వేసిన నాలుగో ఓవర్లో రహానే 4, 6, 6తో గేర్ మార్చాడు. కృనాల్ వేసిన మరుసటి ఓవర్లో నరైన్ కూడా 6, 4తో విజృంభించాడు. 25 బంతుల్లోనే రహానే.. అర్ధ సెంచరీని నమోదుచేశాడు.



### కోహ్లీ బౌలింగ్! ఫ్యాన్స్ ట్రోలింగ్

కోహ్లీ బౌలింగ్ వేయడమేంటి? అదీ ఐపీఎల్ ఫస్ట్ మ్యాచ్‌లో ఫస్ట్ ఓవర్! కానీ లీగ్ బ్రాడ్‌కాస్టర్ 'స్టార్' చేసిన తప్పిదమిది. బెంగళూరు బౌలింగ్ దాడిని హెజిల్‌వుడ్ ఆరంభించినా స్టార్ మాత్రం.. తొలి నాలుగు బంతులపాటు అతడి పేరును కోహ్లీగానే చూపించడంతో నెటిజన్లు ఆటాడుకున్నారు.

### కృనాల్ మాయకు విలవిల



సాఫీగా సాగుతున్న కేకేఆర్ ఇన్నింగ్స్ 10వ ఓవర్ నుంచి గాడి తప్పింది. రసిక్ వేసిన 10వ ఓవర్లో నరైన్.. జితేశ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఆ తర్వాత కృనాల్ వరుస ఓవర్లలో కోల్‌కతాకు షాకులిచ్చాడు. అతడు వేసిన 11వ ఓవర్లో భారీ షాట్ ఆడబోయిన రహానే.. రసిక్‌కు క్యాచ్ ఇచ్చాడు. కృనాల్ తన తర్వాతి ఓవర్లలో వెంకటేశ్ (6), రింకూ సింగ్ (12)ను క్లీన్‌బౌల్డ్ చేశాడు. సుయాశ్ 16వ ఓవర్లో ఆండ్రీ రస్సెల్ (4)నూ బౌల్డ్ చేయడంతో కేకేఆర్ కోలుకోలేకపోయింది.

# 12 ఏండ్ల తర్వాత విండీస్‌తో టెస్టు సిరీస్

## నవంబర్ నుంచి దక్షిణాఫ్రికాతో మూడు ఫార్మాట్ల సిరీస్‌లు

కోల్‌కతా: పన్నెండేండ్ల సుదీర్ఘ విరామం తర్వాత వెస్టిండీస్ టెస్టు జట్టు భారత్‌లో పర్యటించనుంది. రెండు టెస్టుల సిరీస్ ఆడేందుకు గాను విండీస్.. ఈ ఏడాది అక్టోబర్‌లో భారత్‌కు రానుంది. అక్టోబర్ 2న మొహాలీలో తొలి టెస్టు, 10 నుంచి కోల్‌కతాలో రెండో టెస్టు జరుగుతుందని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా తెలిపారు. మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ కెరీర్‌లో ఆడిన చివరి టెస్టు (2013-14లో) తర్వాత కరీబియన్ జట్టు భారత్‌లో పర్యటించనుండటం ఇదే ప్రథమం. విండీస్ జట్టు పలుమార్లు భారత పర్యటనకు వచ్చినా పరిమిత ఓవర్ల సిరీస్‌లు మాత్రమే ఆడింది.

### సఫారీలతో మూడు సిరీస్‌లు

వెస్టిండీస్ పర్యటన ముగిసిన వెంటనే భారత జట్టుతో దక్షిణాఫ్రికాతో మూడు ఫార్మాట్ల సిరీస్‌కు ఆతిథ్యమివ్వనుంది. నవంబర్ నుంచి మొదలుకాబోయే ఈ పర్యటనలో సౌతాఫ్రికా.. రెండు టెస్టులు, మూడు వన్డేలు, ఐదు టీ20లు ఆడనుంది. వచ్చే ఏడాది జరుగబోయే టీ20 ప్రపంచకప్‌నకు ముందు ఇరు జట్లకూ ఇది సన్నాహకంగా మారనుంది. ఢిల్లీలో మొదటి టెస్టు జరగనుండగా ఈశాన్య రాష్ట్రమైన అసోంలోని గువాహటి స్టేడియం రెండో టెస్టుకు ఆతిథ్యమివ్వనుంది. గువాహటిలో ఇదే తొలి టెస్టు కావడం విశేషం. నవంబర్ 30 నుంచి డిసెంబర్ 03 మధ్య మూడు వన్డేలు.. డిసెంబర్ 09 నుంచి 19 దాకా ఐదు టీ20లు జరుగుతాయని బీసీసీఐ తెలిపింది.

### వైజాగ్‌లో మహిళల ప్రపంచకప్ ప్రారంభ మ్యాచ్

ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి భారత్ ఆతిథ్యమివ్వనున్న ఐసీసీ మహిళల ప్రపంచకప్‌నకు సంబంధించిన షెడ్యూల్ త్వరలోనే వెల్లడవనుంది. విశాఖపట్నంలో ఈ మెగా టోర్నీ ప్రారంభ మ్యాచ్ ఉండనున్నట్టు రాజీవ్ శుక్లా తెలిపారు. ముల్లాన్‌పూర్, తిరువనంతపురం, ఇండోర్‌లో ఇతర మ్యాచ్‌లు జరుగనున్నాయి.

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

హాకీ భారతీయుల భావోద్వేగ క్రీడ! కులం, మతం, భాషతో సంబంధం లేకుండా ఆటతో మమేకమైన రోజులవి. స్వాతంత్ర్యం రాక ముందే నుంచే హాకీలో మనది ఘనమైన చరిత్ర. 1920 నుంచి 1980 వరకు హాకీలో మనకు ఎదురన్నదే లేదు. అమెస్టార్‌డామ్(1928) ఒలింపిక్స్ నుంచి మొదలుపెడితే మాస్కో(1980) వరకు భారత్‌ది స్వర్ణచరిత్ర. బరిలోకి దిగితే పసిడి పక్కా అన్న రీతిలో మనోళ్లు వీరవిహారం చేసిన చిరస్మరణీయ సందర్భాలు. హాకీలో మనకు తిరుగేలేదన్న రీతిలో పతకాలు కొల్లగొట్టిన తీరు నభూతో నభవిష్యత్. ఒలింపిక్స్‌కు ఏమాత్రం తీసిపోకుండా 1975 ప్రపంచకప్‌లో మన హాకీ వీరులు సాధించిన విజయం మరువలేనిది. మలేషియా గడ్డపై దాయాది పాకిస్థాన్‌ను మట్టికరిపిస్తూ అజిత్‌పాల్‌సింగ్ సారథ్యంలోని భారత్ తొలిసారి ప్రపంచకప్ టైటిల్ ఒడిసిపట్టుకుంది. ఆద్యంతం అద్భుత ప్రదర్శన భారత్..చిరస్మరణీయ విజయం సొంతం చేసుకున్నారు. మలేషియా గడ్డపై త్రివర్ణ పతాకం రెపరెపలాడి 50 ఏండ్లు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక కథనం.

భారత హాకీది ఘనమైన చరిత్ర. బ్రిటిషర్ల పాలనలో ఓవైపు క్రికెట్ వ్యాపిస్తున్న వేళ అప్పటికే హాకీలో స్వర్ణ యుగం మొదలైంది. ఇంతకుముందే చెప్పుకున్నట్లు హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ కళాత్మక ఆటతీరుతో 1920లోనే మొదలైన మన హాకీ పసిడి వెలుగులు 1980 వరకు దిగ్విజయంగా కొనసాగాయి. అ కాలంలో స్వర్ణ పతకానికి తక్కువ ఏదైనా అది విఫల ప్రదర్శన అన్నట్లు అభిమానులు భావించేవారు. హాకీలో మన ఆధిపత్యానికి ఇది తార్కాణమని చెప్పొచ్చు. అప్పటికే విశ్వక్రీడల్లో పసిడి పతక జైత్రయాత్ర కొనసాగుతున్న వేళ మలేషియా వేదికగా 1975లో జరిగిన హాకీ

# హాకీ స్వర్ణోత్సవ సంబురం

## ప్రపంచకప్‌లో పసిడి పతకానికి 50 ఏండ్లు



ప్రపంచకప్‌లో భారత స్వర్ణ పతక ప్రదర్శన చిరస్మరణీయమని చెప్పాలి. దేశం ఎమర్జెన్సీ వైపు అడుగులు వేస్తున్న వేళ యావత్ జాతిని మళ్లీ ఒక్కతాటి పైకి తీసుకొచ్చింది. అజిత్‌పాల్‌సింగ్ సారథ్యంలోని భారత్ హోరాహోరీగా సాగిన ఫైనల్లో పాకిస్థాన్‌పై 2-1తో చారిత్రక విజయం సాధించింది. అంతకుముందు 1971 ప్రపంచకప్‌తో పాటు మ్యూనిచ్ ఒలింపిక్స్(1972) ఒలింపిక్స్‌లో కాంస్య పతకాలతో సరిపెట్టుకున్న భారత్ మూడేండ్ల వ్యవధిలో జరిగిన మెగాటోర్నీలో సత్తాచాటిన తీరు అమోఘమని **సీనియర్ క్రీడా విశ్లేషకులు చంద్రశేఖర్..**నమస్తే తెలంగాణతో చెప్పుకొచ్చారు. క్రికెట్ కంటే ముందే హాకీలో భారత్ అపురూప విజయాలు సొంతం చేసుకుందని ఆయన పేర్కొన్నారు. పాక్‌తో ఫైనల్‌కు ముందు ఆతిథ్య మలేషియాతో సెమీస్ పోరు హోరాహోరీగా సాగింది. ఉత్కంఠ ఊపేసిన మ్యాచ్‌లో ఆఖరి నాలుగు నిమిషాల్లో యువ ప్లేయర్ అస్లాం షేర్‌ఖాన్ అద్భుతం చేశాడు. అప్పటి వరకు 2-1తో ఆధిక్యంలో ఉన్న మలేషియాను మట్టికరిపించాడు. కెప్టెన్ అజిత్‌పాల్ సూచనతో పెనాల్టీ కార్నర్ షాట్‌ను ప్రత్యర్థి గోల్‌కీపర్‌ను ఏమారుస్తూ అస్లాం కొట్టిన గోల్‌తో భారత్ గెలుపు సంబురాల్లో మునిగిపోయింది. దీంతో స్కోరు 2-2తో డ్రా కాగా అదనపు సమయంలో హర్‌చరణ్ గోల్‌తో భారత్ ఫైనల్లోకి ప్రవేశించింది. పాక్‌తో తుదిపోరులో భారత్ తరఫున సుర్జీత్‌సింగ్(44ని), ధ్యాన్‌చంద్ కొడుకు అశోక్‌కుమార్(51ని) గోల్స్ చేశారు. జాహిద్(17ని) పాక్‌కు ఏకైక గోల్ అందించాడు. ఆఖరి నిమిషం వరకు ఉత్కంఠగా సాగిన పోరులో భారత్‌నే విజయం వరించింది. ఈ మ్యాచ్‌కు లైవ్ కామెంటరీ అందించిన జస్విందర్‌సింగ్, డిమెల్లో వ్యాఖ్యానంతో భారతావని పులకించిపోయింది. అప్పటి జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించిన అస్లాం ఆ తర్వాత ఎంపీగా ఎన్నికయ్యాడు. అయితే 50 ఏండ్లు పూర్తయిన సందర్భంగా ఇటీవల హాకీ ఇండియా అనాటి జట్టు సభ్యులను ఘనంగా సన్మానించింది. హాకీ చరిత్రకారుడు అర్ముగమ్, ఎరోల్ డిక్రజ్ రాసిన 'మార్చ్ ఆఫ్ గ్లోరీ' పుస్తకాన్ని ఇటీవలే ఆవిష్కరించారు. అనాటి చారిత్రక విజయాన్ని ప్రేరణగా తీసుకోని భారత హాకీ పునర్వైభవం దిశగా అడుగులు వేస్తుందని ఆశిద్దాం.

### నేడే సన్‌రైజర్స్ 'ఫస్ట్ షో'



హైదరాబాద్, ఆట ప్రతినిధి: గత సీజన్‌లో అందరి అంచనాలను తలకిందులు చేస్తూ 'బ్లాక్ బస్టర్' ఆటతీరుతో దుమ్మురేపిన సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) శనివారం నుంచి కొత్త సీజన్‌ను ప్రారంభించబోతోంది. నిరుడు తృటిలో కప్పు కోల్పోయిన ఆరెంజ్ ఆర్మీ.. ఈసారి మాత్రం టైటిల్‌ను వదలకూడదనే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. ఆదివారం హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో రాజస్థాన్ రాయల్స్‌తో జరుగబోయే మ్యాచ్‌తో ట్రోఫీ వేట మొదలుపెట్టనుంది. ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్, నితీశ్ రెడ్డి వంటి హిట్టర్లకు తోడు సారథి పాట్ కమిన్స్, మహ్మద్ షమీ, ఆడమ్ జంపా వంటి అంతర్జాతీయ స్థాయి బౌలర్లతో పటిష్టంగా ఉన్న హైదరాబాద్.. 'తొలి ఆట'తోనే బొమ్మ అదరగొట్టాలని భావిస్తోంది.

### సెమీస్‌లో గాయత్రి జోడీ నిష్క్రమణ

బాసెల్: స్విస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత మహిళల డబుల్స్ ఆటగాళ్లు గాయత్రి గోపీచంద్-త్రిసా జాలీ ద్వయం పోరాటం సెమీస్‌లోనే ముగిసింది. శనివారం జరిగిన సెమీఫైనల్ పోరులో ఈ భారత జోడీ 21-15, 15-21, 12-21తో టాన్ నింగ్-లి షెంగ్‌షు (చైనా) చేతిలో ఓడింది. పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో శంకర్ సుబ్రహ్మణ్యన్ 10-21, 14-21తో క్రిస్టో పోపోవ్ (ఫ్రాన్స్) చేతిలో పరాభవం పాలయ్యాడు. ఈ ఓటములతో టోర్నీలో భారత పోరాటం సైతం ముగిసినట్టైంది.




కాజీపేట రైల్వే జంక్షన్‌లోని 2, 3 ప్లాట్‌ఫాంలు



4, 5 అదనపు ప్లాట్‌ఫాంలు నిర్మించాల్సిన ప్రాంతం

# అదనపు ప్లాట్‌ఫాంలకు మోక్షమెప్పుడో?

- ఇరుకుగా కాజీపేట రైల్వే జంక్షన్
- ఎనిమిదేళ్ల క్రితమే 4, 5 అదనపు ప్లాట్‌ఫాంలు మంజూరు
- అధికారుల నిర్లక్ష్యంతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- వెంటనే నిర్మించాలని డిమాండ్

కాజీపేట, మార్చి 22 : ఉత్తర, దక్షిణ భారతదేశానికి ముఖ్య కేంద్రం, రాష్ట్రంలో రెండో అతిపెద్ద రైల్వే జంక్షన్‌గా గుర్తింపు పొందిన కాజీపేట రైల్వే జంక్షన్‌లో అదనపు ప్లాట్‌ఫాంలు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పెరుగుతున్న రద్దీతో రైల్వే శాఖ దాదాపు ఎనిమిదేళ్ల క్రితమే కాజీపేట రైల్వేస్టేషన్‌లో 4, 5 అదనపు ప్లాట్‌ఫాంలు నిర్మించాలని గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అధికారుల నిర్లక్ష్యంతోనే వాటి నిర్మాణాలు జరగడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈఎల్‌ఎస్ షెడ్డు ప్రహరీ అడ్డు వస్తుందని కొందరు రైల్వే అధికారులు సాకు చూపించడంతో వాటికి మోక్షం కలగ లేదని రైల్వే ట్రేడ్ యూనియన్ల నేతలు చెబుతున్నారు. కాజీపేట జంక్షన్ మీదుగా నిత్యం వందకు పైగా ప్రయాణికుల రైళ్లు రాకపోకలు సాగిస్తుండగా, దాదాపు నలభై ఐదు వేల మంది తమ గమ్యస్థానాలకు వెళ్తుంటారు. జంక్షన్‌లో మూడు ప్లాట్‌ఫాంలు మాత్రమే ఉండడంతో అక్కడంతా ప్రయాణికులతో బిజీగా ఉంటుంది. రైల్వేశాఖ సుదూర ప్రాంతాల ప్రజల రద్దీని దృష్టిలో పెట్టుకొని కాజీపేట మీదుగా రైళ్లను విపరీతంగా పెంచడం, తగినన్ని ప్లాట్‌ఫాంలు లేకపోవడంతో జంక్షన్ ఇరుకుగా మారిపోతున్నది. దీంతో పాటుగా రైలు వచ్చే ముందు అధికారులు ఏ ప్లాట్‌ఫాం మీదికి వస్తుందోనని అనౌన్స్‌మెంట్ చేయగానే తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతూ బోగీల వద్దకు పరుగులు తీస్తుంటారు. జంక్షన్‌లో తగినన్ని ప్లాట్‌ఫాంలు లేకపోవడం, రైళ్ల రద్దీ ఎక్కువగా ఉండడంతో అధికారులు రైళ్లను ఎక్కువ సమయం ఔటర్‌లోనే నిలుపుతుంటారు. స్టేషన్ ఔటర్‌లో చాలా సమయం రైళ్లను అధికారులు నిలపడంతో ప్రయాణికులు వేచి ఉండలేక అవస్థలు పడుతున్నారు. నిజాం ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్లాట్‌ఫాంలు తప్ప ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లేకపోవడంతో ఇరుకు జంక్షన్‌తోనే కాలం వెళ్లదీస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత రైల్వే అధికారులు చొరవ తీసుకుని కాజీపేట రైల్వే స్టేషన్‌కు మంజూరైన 4, 5 అదనపు ప్లాట్‌ఫాంల నిర్మాణం వెంటనే చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

### నాడు పచ్చదనం.. నేడు కళావిహీనం

*బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పచ్చదనం, పరిశుభ్రతతో ఆహ్లాదకరంగా ఉన్న పల్లెప్రకృతి వనాలు నేడు కళావిహీనంగా దర్శనమిస్తున్నాయి. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం శివాజీనగర్ గ్రామంలో కేసీఆర్ సర్కార్ పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేసింది. అందులో పండ్లు, పూలు, నీడనిచ్చే మొక్కలు నాటి, రాశీ నక్షత్రవనం ఏర్పాటు చేసింది. దీంతో ఎంతో ఆహ్లాదాన్ని పంచింది. కానీ నేడు నిర్వహణ లోపం వల్ల ప్రకృతి వనంలోని మొక్కలన్నీ ఎండిపోయాయి.*

*- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్*



ఎండిన మొక్కలతో కళావిహీనంగా దర్శనమిస్తున్న ప్రకృతి వనం





Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd., Plot No. 139 &146, TSIIC Industrial Park, Madikonda Village, Dist: WARANGAL URBAN - 506 142 , Published at Telangana Publications Pvt. Ltd., Plot No. 139 &146, TSIIC Industrial Park, Madikonda Village, Dist: WARANGAL URBAN - 506 142 , Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38339